

ఫ్లైఓవర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు

## జనగామ ఫ్లైఓవర్ బ్రిడ్జి పిల్లర్ల వద్ద పగుళ్లు

### మరమ్మతులు చేయాలని అమ్మ ఫౌండేషన్ డిమాండ్

జనగామ, జూలై 29 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని నెహ్రూపార్క్ నుంచి జిల్లా ప్రధాన ఆస్పత్రి వరకున్న ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గ్యాప్‌ల్లో పెరుగుతున్న చెట్లు ప్రమాదకరంగా మారాయని, బాటసారులు ఉపయోగించాల్సిన పుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన పూల కుండీలను తొలగించాలని అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. సోమవారం ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమ్‌రాజ్ బృందం పరిశీలించింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్లైఓవర్ నిర్మించి మూడు దశాబ్దాలు గడిచిన తరుణంలో ప్రతి పిల్లర్ వద్ద పగుళ్లు వచ్చి అక్కడ చెట్లు పెరుగుతున్నందున వాటిని వెంటనే తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. వంతెనపై పెద్ద కుండీలను ఏర్పాటు చేయడంతో పాదాచారులు పుట్‌పాత్‌పై వెళ్లలేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఓవర్ బ్రిడ్జిపైకి ఎక్కే మెట్లు రెండు చోట్ల ఊడిపోయి ఇనుపచువ్వలు కనిపిస్తూ ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. ప్రమాదం జరిగినప్పుడు తాత్కాలికంగా రిపేరు చేస్తున్నారు తప్ప అక్కడ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయడం లేదని మణికుమార్ తెలిపారు. సమస్యలను అధికారులు పరిశీలించి పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు లకన్ సింగ్, కొల్లూరు చందు, చిక్కుడు నగేశ్, పవన్ పాల్గొన్నారు.

## 'పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి'

నర్మెట, జూలై 29: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్ యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని కేఎస్‌ఆర్ గార్డెన్‌లో పార్టీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజు అధ్యక్షతన సోమవారం మండల కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ సంస్థాగత నిర్మాణానికి, స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి కృషి చేయాలన్నారు. అనంతరం నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నగేశ్‌ను వారు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సొక్కం అనిల్‌కుమార్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి ధరావత్ శ్రీనివాస్, కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి బైరగోని అంజనేయులు, బీజేవైఎం జిల్లా ప్రతినిధి రాజబోయిన శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు చెవుల రాజు, కొన్నె రాజు, మెతుకు సిద్దులు, బుచ్చాల కొమురెల్లి, ప్రభాకర్, అంజనేయులు, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం చేస్తున్న జ్ఞానవేదిక సభ్యులు

## భగవద్గీతపై చినమడూరులో ఇంటింటి ప్రచారం

దేవరుప్పుల, జూలై 29 : ప్రభాత సేవా సమితి ఆధ్వర్యంలో భగవద్గీతపై మండలంలోని చినమడూరులో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత పుస్తకాలను ఉచితంగా అందజేశారు. సమితి బాధ్యులు మాట్లాడుతూ భగవద్గీత విశిష్టతను పూర్వకాలంలో శ్రీకృష్ణుడే వివరించారని తెలిపారు. న్యాయం, ధర్మాన్ని తరతరాలకు అందించిన గ్రంథం భగద్గీత అన్నారు. జ్ఞాన వేదిక భువనగిరి, జనగామ, చేర్యాల, తొర్రూరు కమిటీల సభ్యులు దేవేంతర్, శంకర్, లక్ష్మీనారాయణ, లింగస్వామి, సాయిరాజ్, యాదగిరి, ఉపేందర్, కోటి, లత, మిన్ను, మహేశ్ పాల్గొన్నారు.

## వీఎస్సార్‌నగర్ దుర్గామాత ఆలయంలో చోరీ

బచ్చన్నపేట, జూలై 29 : మండలంలోని వీఎస్సార్‌నగర్ దుర్గామాత ఆలయంలో ఆదివారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయం తాళం పగుల గొట్టి అమ్మవారి ఆభరణాలు, హుండీలోని నగదు చోరీ చేశారు. ఆదివారం ఉదయం గమనించిన ఆలయ పూజారి మధు, మాజీ సర్పంచ్ కోనేటి స్వామి సమాచారం ఇవ్వగానే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సతీశ్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**
I, RUMANA FATHIMA (New Name), previously called RUMAN FATIMA (Old Name), and residing at H.No. 25-8-441/1, Bapuji Nagar, Kazipet, Hanumakonda Dist.- 506003, T.S., India. and solemnly declare.

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
JANGAON
9182777565
MAHABUBABAD
9182777557

## 'మహాలక్ష్మి'తో పెరిగిన ఆర్టీసీ ఆదాయం

### వరంగల్ ఆర్‌ఎం విజయభాను

హనుమకొండ చౌరస్తా, జూలై 29 : ఆర్టీసీ డిసెంబర్ 9న ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మహాలక్ష్మి పథకంతో ఆదాయం పెరిగిందని, రూ.35 కోట్ల లాభం చేకూరిందని ఆర్‌ఎం విజయభాను తెలిపారు. హనుమకొండ బస్‌స్టేషన్‌లోని ఆర్‌ఎం ఆఫీస్‌లో ఆయన మాట్లాడుతూ.. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల పరిధిలో మొత్తం 928 బస్సులు ఉండగా మహాలక్ష్మి పథకం కింద 759 బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. పథకం ప్రారంభమైనప్పటి నుంచి రీజియన్‌లో 9.46 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించగా, వారిలో 5.78 లక్షల మంది మహిళలు(61 శాతం) మహాలక్ష్మి స్కీమ్‌ను వినియోగించుకున్నట్లు చెప్పారు. మహాలక్ష్మి ప్రయాణికులతో రద్దీ పెరిగిన దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రూట్లలో బస్సుల సంఖ్య, సమయాలను క్రమబద్ధీకరించామని, నూతనంగా 20 రూట్లలో బస్సులను నడిపినట్లు తెలిపారు. డిప్యూటీ ఆర్‌ఎంలు మాధవరావు పాల్గొన్నారు.

# అక్రమ కేసులపై విద్యార్థుల ఆందోళన

- బచ్చన్నపేట, జఫర్‌గఢ్‌లో ఎస్‌ఎఫ్‌ఐ నేతృత్వంలో నిరసన
- కేసులు ఎత్తేయకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు నేతల హెచ్చరిక





బచ్చన్నపేట, జఫర్‌గఢ్ మండల కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న నాయకులు

బచ్చన్నపేట, జూలై 29 : విద్యార్థి సంఘాల నాయకులపై రెండు రోజుల క్రితం పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను వారు దహనం చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కేవలం 7.3 శాతం నిధులు కేటాయించారని ఆవేదన వ్యక్తం చేస్తూ బడ్జెట్ ప్రతులను వారు దహనం చేశారు. రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, ధర్మభిక్షంపై కాంగ్రెస్ నేతల ఒత్తిళ్లతో ఎస్సై శ్వేత అక్రమంగా కేసులు పెట్టారని విమర్శించారు. నాయకులు మాట్లాడుతూ బడ్జెట్ కేటాయింపులో అన్యాయం జరిగిందని ధర్నా చేస్తే కేసులు పెడుతారా అని ప్రశ్నించారు. వీటిని తొలగించకుంటే ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ మండల నాయకులు అఖిల్, చరణ్ తేజ్, అక్షయ్, ముఖేశ్, ఉదయ్, ప్రశాంత్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

**జఫర్‌గఢ్‌లో..**

జఫర్‌గఢ్ : విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆందోళన నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులపై పోలీసులు అక్రమంగా కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో సోమవారం విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాథోడ్ యాకన్న మాట్లాడుతూ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని ప్రకటించి ఆచరణలో విఫలమైందన్నారు. యూనివర్సిటీలు, గురుకులాలకు అత్యంత తక్కువ నిధులు కేటాయించారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులకు నిధులు కేటాయించాలని కోరితే అక్రమంగా కేసులు పెట్టారని యాకన్న తెలిపారు. కేసులు ఎత్తేయాలని, లేకుంటే ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అర్జున్, శ్రీకాంత్, ఇందు, ఆర్య, ఈశ్వర్, అజయ్ పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

బచ్చన్నపేట, జూలై 29 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా ప్రజలు సహకరించాలని గోపాల్‌నగర్ పంచాయతీ కార్యదర్శి మోకు కవిత అన్నారు. సోమవారం గ్రామంలోని పరిసరాలను ఆమె శుభ్రం చేయించారు. కస్తూర్భాగాంధీ బాలికల విద్యాలయం పక్కన వీధులు, కాల్వలను పారిశుధ్య సిబ్బందితో క్లీన్ చేయించారు. కవిత మాట్లాడుతూ బచ్చన్నపేటలోని ఇందిరానగర్ కాలనీ నుంచి వచ్చే మురుగునీరు గోపాల్‌నగర్ పరిసర ప్రాంతాలను కలుషితం చేస్తుందన్నారు. ఇటువైపు రాకుండా చర్యలు తీసుకోవాలని బచ్చన్నపేట జీపీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో కారోబార్ కొండ లలిత పాల్గొన్నారు.

## తెలంగాణ కళావేదిక జిల్లా సంయుక్త కార్యదర్శిగా రాజు



రఘునాథపల్లి, జూలై 29: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన పెద్దగోని రాజును తెలంగాణ కళావేదిక జిల్లా సంయుక్త కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు నకిరికంటి కిరణ్‌కుమార్, కార్యదర్శి గజవెల్లి ప్రతాప్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. రాజుకు నియామక పత్రాని జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల ఎల్లన్న నియమాక పత్రా న్ని రాజుకు అందించారు. రాజు మాట్లాడుతూ ఈ ఎన్నికకు సహరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## బీజేవైఎం మండల అధ్యక్షుడిగా అవినాష్

నర్మెట, జూలై 29 : బీజేవైఎం మండల అధ్యక్షుడిగా మండలంలోని వెల్దండకు చెందిన బొల్లం అవినాష్‌ను నియమించారు. ఈ మేరకు బీజేపీ మండల అధ్యక్షుడు ధరావత్ రాజునాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాజ్ యాదవ్ సోమవారం నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆవినాష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తల సహకారంతో ముందుండి పనిచేస్తానని పేర్కొన్నారు.

## ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

### ఆర్టీసీ ఆర్‌ఎం విజయభాను



స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్ ఆవరణలో మొక్క నాటుతున్న ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 29 : ఆర్టీసీ ఉద్యోగులు మొక్కలు నాటి సంరక్షించాలని వరంగల్ రీజినల్ మేనేజర్ విజయభాను కోరారు. వన మహోత్సవంలో భాగంగా సోమవారం డివిజన్ కేంద్రంలోని బస్టాండు ఆవరణలో ఆర్టీసీ సిబ్బంది, ప్రయాణికులతో కలసి ఆయన మొక్కలు నాటారు. విజయభాను మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని తొమ్మిది డిపోలు, బస్టాండ్లలో వంద చొప్పున మొక్కలు నాటుతామని అన్నారు. ప్రయాణికుల కోసం బస్టాండ్లలో మరిన్ని వసతులు కల్పిస్తామని, ఇప్పటికే కొన్ని బస్టాండ్లలో మరమ్మతులు చేపట్టామన్నారు. ప్రయాణికులు తమ సమస్యలపై ఫిర్యాదు చేస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఆర్టీసీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ప్రహరీలను నిర్మిస్తామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని, దీంతో పురుషులకు సీట్లు లభించడం లేదని సమాచారం ఉందన్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం స్థానికులు తమ సమస్యలను ఆర్‌ఎంకు వివరించారు. స్టేషన్‌ఘన్‌పూర్‌లో డీలక్స్ బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, రాత్రి ఎనిమిది తరువాత ఆర్డీనరీ బస్సులు లేకపోవడం, ఎక్స్‌ప్రెస్ బస్సులు కూడా తక్కువగా ఉన్నాయని, రాత్రి ఎనిమిది నుండి 12 గంటల వరకు డిలక్స్ బస్సులకు హాల్టింగ్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్‌ఎం భానుకిరణ్, డీఎం మోహన్ రావు, కంట్రోలర్ ఈఎస్ బాబు, ట్రాఫిక్ గైడ్ శివానంద, మాజీ డ్రైవర్ బోసు ఐలయ్య, ఈజీఎస్ రాజు పాల్గొన్నారు.

## క్షీరగిరిక్షేత్రంలో భక్తుల కోలాహలం

### సోమేశ్వరుడిని దర్శించుకున్న భక్తులు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పాలకుర్తి, జూలై 29: మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయం సోమవారం భక్తజనంతో కోలాహలంగా మారింది. సెలవుదినం కావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు వరంగల్ ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా సోమేశ్వరుడితోపాటు లక్ష్మీనర్సింహస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు తమ ఇష్ట దైవాలను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. కొండ దిగువ ఉన్న చండీక అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు దేవగిరి సోమన్న, నాగరాజు, ఆలయ సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, సిబ్బంది ముంజ రాములు, పాల్గొన్నారు.

## బీజేపీ మతోన్మాద విధానాలపై ఉద్యమించాలి

### మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి

జఫర్‌గఢ్, జూలై 29 : కేంద్రంలోని బీజేపీ పాలనలో మతతత్వం పెరిగిపోయిందని, రైతులు, కార్మికులు, నిరుద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సీహెచ్ రాజారెడ్డి ఆరోపించారు. సోమవారం మండలంలోని ఉప్పుగల్లులో ఎండీ యాకూబ్‌పాషా అధ్యక్షతన జరిగిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ దేశంలోని బడా కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా విక్రయిస్తూ నిరుద్యోగాన్ని పెంచుతున్నారని విమర్శించారు. రైతులు, కార్మికులకు వ్యతిరేకంగా నూతన చట్టాలను తీసుకొస్తున్నందున దీనిని వ్యతిరేకించాలని ఆయన కోరారు. కేంద్ర బడ్జెట్‌లో పేదలకు ఎలాంటి రాయితీలు ప్రకటించలేదని, నిధుల కేటాయింపు తగ్గించారని విమర్శించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించుకునేలా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి అది సాయన్న, రాష్ట్ర సమితి సభ్యురాలు పాతూరి. సుగుణమ్మ, మండల కార్యదర్శి జువారి రమేశ్, బీకేఎంఎం జిల్లా అధ్యక్షులు మండల గట్టుమల్లు, నాయకులు కూరపాటి చంద్రమౌళి, పెండ్యాల సమ్మయ్య, బుల్లె దూడయ్య, మంద బుచ్చయ్య, జాఫర్, కలకోట ప్రభాకర్, ముసలయ్య, యాదగిరి, అన్నెపు.అజయ్, తాడెం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు

## పెరిగిన ధరలకనుగుణంగా మెస్‌చార్జీలు పెంచాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 29 : పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసగాని సుమ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని సంక్షేమ హాస్టళ్లను ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధి బృందం సందర్శించింది. విద్యార్థులతో మాటాడి సమస్యలు తెలుసుకున్న అనంతరం సుమ మాట్లాడుతూ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని తెలిపారు. కేజీబీవీ విద్యార్థులకు మెడికల్ కిట్లు లేవని, బెడ్స్, దుప్పట్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం నేపథ్యంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులపై అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని సుమ డిమాండ్ చేశారు. ఎస్సై శ్వేతపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఇందు, ఆర్య, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు

## చోరీకి పాల్పడిన వ్యక్తి రిమాండ్



నిందితుడి అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

పాలకుర్తి, జూలై 29: మండల కేంద్రంలోని ఓ కిరాణ దుకాణంలో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని నరసింహుల ప్రకాశ్‌కు చెందిన కిరాణ షాపులో ఈనెల 25న చోరీ జరిగింది. సోమవారం మండలంలోని విస్నూరు బస్టాండ్ వద్ద ఎస్సై లింగారెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సోమిరెడ్డి, కానిస్టేబుళ్లు రాజ్‌కుమార్ ,యాకయ్య నరేశ్‌తో కలిసి వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఆటో నుంచి ఓ వ్యక్తి అనుమానాస్పదంగా దిగి పారిపోయే ప్రయత్నం చేస్తుండగా పట్టుకొని విచారించారు. నిజామాబాద్ జిల్లా సంగెం మండలం చందూరుకు చెందిన కత్తి అశోక్‌గా గుర్తించారు. కిరాణ దుకాణంలో చోరీకి పాల్పడినట్లు అతడు ఒప్పుకున్నట్లు తెలిపారు. ఆతని వద్ద రూ.4 వేలు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ కేసులో పరిశోధించే క్రమంలో వరంగల్ కమిషనర్ కార్యాలయానికి చెందిన ఎండీ సాల్మన్‌పాషా సహకరించారన్నారు. కేసును చేధించినందుకు ఎస్సై లింగారెడ్డి, సిబ్బందిని జనగామ డీసీపీ ఆభినందించారు. సమావేశంలో ఎస్సై సాయి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

## నేడు జీపీ ఉద్యోగుల చలో హైదరాబాద్

బచ్చన్నపేట, జూలై 29 : గ్రామ పంచాయతీ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరుతూ నేడు తలపెట్టిన చలో హైదరాబాద్‌కు ఉద్యోగులు తరలి రావాలని జేఏసీ జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో జేఏసీ నాయకులు కొమురెల్లి శ్రీనివాస్, ప్రభాకర్, బాబుగౌడ్, లలిత, రాజు, నాగయ్య, శ్రీనివాస్, అన్వర్, చంద్రశేఖర్, సురేశ్ విలేకరులతో మాట్లాడారు. జీవో 51ను రద్దు చేసి గ్రామ పంచాయతీ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరారు. కనీస వేతనాలు అమలు చేయాలని, మల్టీ పర్పస్ విధానం రద్దు చేసి కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలన్నారు. పీఆర్‌సీ పరిధిలోకి పంచాయతీ ఉద్యోగులను తీసుకురావాలని, ప్రభుత్వమే సిబ్బందికి వేతనాలను ప్రత్యేక బడ్జెట్ ద్వారా అందించాలని విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాకు మండలంలోని గ్రామ పంచాయతీ ఉద్యోగులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు.

## అర్హులకు సంక్షేమ ఫలాలు

బచ్చన్నపేట, జూలై 29 : ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులకు అందించేలా కార్యకర్తలు కృషి చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు మొగుళ్ల రాజిరెడ్డి సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల ప్రకారం మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, వంటగ్యాస్ సబ్సిడీ, తెల్ల రేషన్‌కార్డుదారులకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ అమలు చేస్తున్నట్లు రాజిరెడ్డి తెలిపారు. మిగిలిన పథకాలు దశల వారీగా అమలు చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఆయన వెంట ఉడుముల బాల్‌రెడ్డి ఉన్నారు.

## సీపీ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్

సుబేదారి, జూలై 29 : సైబర్ నేరగాళ్లు సోషల్‌మీడియాలో వరంగల్ సీపీ పేరుతో ఫేస్‌బుక్‌లో ఫేక్ అకౌంట్ ఓపెన్ చేసి, పలువురికి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లు పంపిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీపీ అంబర్ కిశోర్ ఝా స్పందించారు. తన పేరుపై క్రియేట్ చేసిన నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి వస్తున్న ఫ్రెండ్ రిక్వెస్టులకు ఎవరూ స్పందించొద్దని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుగేందర్‌రెడ్డి

## 4న షూటింగ్‌బాల్ క్రీడాకారులకు సన్మానం

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 29 : షూటింగ్ బాల్ క్రీడాకారులను వచ్చే నెల 4న సత్కరించనున్నట్లు షూటింగ్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఇనుగాల యుగేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలో నిర్వహించిన షూటింగ్‌బాల్ అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత సంవత్సరం జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు హాజరైన పది మంది క్రీడా కారులను సన్మానించామని గుర్తు చేశారు. 2024-2025 సంవత్సరంలో చేపట్టాల్సిన కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందించామన్నారు. అధ్యక్షులు మంద రమేశ్, ప్రధాన కార్యదర్శి అన్నెపు కుమార్, ఉపాధ్యక్షుడు బొజ్జపల్లి సుభాశ్, పురమాని రజాక్, భూక్యా సుధాకర్‌నాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు సీహెచ్ సుధాకర్, దిలీప్‌కుమార్, చందర్, రాజన్న, అజయ్, సఫీర్, రమేశ్, గంగాధర్‌రెడ్డి, గణేశ్, మధు పాల్గొన్నారు.



బాధితురాలిని పరామర్శిస్తున్న చల్లా ఉమా సుధీర్‌రెడ్డి

## బాధితురాలికి ఆర్థిక సాయం

స్టేషన్ ఘన్‌పూర్, జూలై 29 : మండలంలోని తాటికొండకు చెందిన అక్కనపల్లి ఉపేంద్ర అనారోగ్యానికి గురికావడంతో మాజీ సర్పంచ్ చల్లా ఉమా సుధీర్‌రెడ్డి సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మెరుగైన వైద్యం కోసం వైద్య నిపుణులను సంప్రదించి మందులు వాడాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నాగరాజు, దామెర శ్రీను, బొల్లం నాగరాజు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని సముద్రాలకు చెందిన రవిచందర్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న నేపథ్యంలో విషయం తెలుసుకున్న బాల్య మిత్రులు సోమవారం పరామర్శించారు. రవిచందర్ కుటుంబానికి అండగా నిలిచి రూ.19 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బండి కిశోర్, పాడిశెట్టి యాదగిరి, పెద్దరబోయిన రాజు, ఖాన్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా మహేందర్



మహేందర్‌కు నియామక పత్రాన్ని ఇస్తున్న ప్రీతం

జనగామ, జూలై 29 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా గనిపాక మహేందర్ నియమితులయ్యారు. జనగామ మండలం శామీర్‌పేటకు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు మహేందర్‌కు సోమవారం టీ-పీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగగిరి ప్రీతం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మహేందర్‌ను జనగామ మాజీ మున్సిపల్ చైర్మన్ వేమళ్ల సత్యనారాయణరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ ఎర్రమల్ల సుధాకర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కంచె రాములు, యూత్ కాంగ్రెస్ నాయకులు చింతకింది మల్లేశం తదితరులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లా కన్వీనర్‌గా శరత్‌బాబు..



శరత్‌బాబు

జఫర్‌గఢ్, జూలై 29 : ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్‌గా తాటికాయల శరత్‌బాబు నియమించారు. ఈ మేరకు టీ-పీసీసీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ నల్ల శ్రీరాములు సోమవారం నియమాక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు అందేలా చూస్తానన్నారు. బాధ్యతలు అప్పగించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్ నగరిగారి ప్రీతమ్, జిల్లా చైర్మన్ నల్ల శ్రీరాములు, మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రాంబాబు

## మృతుడి కుటుంబానికి పరామర్శ

రఘునాథపల్లి, జూలై 29: మండలంలోని వెల్ది గ్రామానికి చెందిన గుడిపాటి నర్సయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ మారుజోడు రాంబాబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యుల పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ పెండ్లి మల్లారెడ్డి, జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చెంచు రమేశ్ పాల్గొన్నారు



నామినేషన్‌కు హాజరైన పద్మశాలి సంఘం నాయకులు

## పద్మశాలి సంఘం అధ్యక్ష పదవికి నామినేషన్

చిల్పూరు,జూలై 29 : తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్ష పదవికి వల్లకాటి రాజ్‌కుమార్ సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి మండలంలోని సంఘం నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గజ్జెల దామోదర్, ఉపాధ్యక్షుడు బండారి రాజ్‌కుమార్, కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు, యూత్ అధ్యక్షుడు పేరాల నాగభూషణం, మేర్గు సుధాకర్ పాల్గొన్నారు.